క్లుప్తంగా

మానవ తప్పిదాల వల్లే రోడ్డు ప్రమాదాలు



యానాం-ద్వారపూడి రహదారిపై కోలంక వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై, స్టేషన్ సిబ్బంది

కాజులూరు: మానవ తప్పిదాల వల్లే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని గొల్లపాలెం పోలీస్‌స్టేషన్ ఎస్సై ఎం.మోహన్‌కుమార్ అన్నారు. ఆదివారం యానం, ద్వారపూడి రహదారిపై కోలంక వద్ద ఎస్సై, స్టేషన్ సిబ్బంది నాకాబందీ నిర్వహించి మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేశారు. ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపే సమయంలో ప్రయాణికులు మద్యం తాగడం వలన వాహనాలను నడిపే వారికే కాకుండా రోడ్డుపై వెళ్లే వారికీ ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. మద్యం తాగి వాహనాలు నడపడం, అనధికారికంగా వాహనాల్లో మద్యం తరలించడం నేరమన్నారు.

నందిగం సురేష్ అరెస్టు అక్రమం

కపిలేశ్వరపురం: బాపట్ల మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ నాయకుడు నందిగాం సురేష్‌ను మరో సారి అరెస్టు చేయడం అక్రమమని కపిలేశ్వరపురం మండల పరిషత్ విప్ పలివెల మధు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ పలివెల సుధాకర్ ఖండించారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న దళిత నేతను అక్రమంగా కేసులు పెట్టి హింసించడం అప్రజాస్వామికమన్నారు. కూటమి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలను మానుకోవాలని హితవు పలికారు.

నేడు స్వామి జన్మనక్షత్ర పూజలు

కపిలేశ్వరపురం: అంగరలోని శ్రీవైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి జన్మనక్షత్రమైన శ్రవణ నక్షత్ర పూజలు సోమవారం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 3 గంటలకు స్వామికి పంచామృతాభిషేకం పూజలు చేస్తారన్నారు. అనంతరం స్వామి దర్శనానికి భక్తులకు అనుమతిస్తామన్నారు.

150 మందికి బీఎండీ పరీక్షలు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణం బురుగుంట చెరువు పార్కులో ఆదివారం డొక్కా సీతమ్మ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఎముకల్లో ఖనిజ సాంద్రతన తెలియజేసే ఉచిత బీఎండీ పరీక్ష శిబిరాన్ని నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు కోన సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో డాక్టర్ బిక్కిన తాతబ్బాయి చౌదరి, డా.ఎండీ హైదర్‌లు 150 మంది రోగులను పరీక్షించారు. వైద్యులు మాట్లాడుతూ తరచూ ఎముకల సాంద్రత పరీక్ష చేయించుకోవడం ద్వారా ఎముకల్లో ఉన్న పటుత్వంపై అవగాహన వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నీషియన్ రమేష్, మెడికల్ రిప్రజెంటేటివ్ జావిద్, క్లబ్ ప్రధాన కార్యదర్శి అబ్బాస్, ఉపాధ్యక్షుడు రెడ్డిరాజు, సీహెచ్ భాస్కరరాజు, గంపల సత్యప్రసాద్, వెంకట్రావు, తాతపూడి సుధీర్, కన్న, వాసు పాల్గొన్నారు.

కష్టజీవుల కష్టాలపై కనువిప్పు కలగాలి



శీలలో రైతులు, ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న రాజబాబు తదితరులు

కాజులూరు: కష్ట జీవుల కష్టాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కనువిప్పు కలిగేలా ప్రజలు పోరాటాలు చేయాలని ఏపీ కౌలు రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు అన్నారు. ఆదివారం మండలంలోని శీల, శీల లంక, ఒంటితాడి, మంజేరు తదితర గ్రామాల్లో రాజబాబు తదితరులు పర్యటించి రైతులు, కార్మికులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 20న వామపక్షాల ఆధ్వర్యంలో జరగనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు అమలు చేస్తాం

కపిలేశ్వరపురం (మండపేట): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రాధాన్యతా క్రమంలో అమలు చేస్తామని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మండపేట పట్టణంలో ఆదివారం టీడీపీ మండపేట నియోజకవర్గ మినీ మహానాడు నిర్వహించారు. మండపేట పట్టణం, రూరల్ మండలం, రాయవరం, కపిలేశ్వరపురం మండలాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. ఎమ్మెల్యే వేగుళ్ళ మాట్లాడుతూ ప్రతికూల ఆర్థిక పరిస్థితుల్లో సైతం కూటమి ప్రభుత్వం ప్రజల ప్రయోజనార్థం పాలన సాగిస్తోందన్నారు. తాము విమర్శలను ఎదుర్కొంటున్నామని కొందరు నాయకులు నాతో అన్నారని, మనం బాగా పనిచేస్తున్నాం కాబట్టే విమర్శిస్తున్నారని గమనించి మరింత ఉత్సాహంతో పనిచేయండని చెప్పారు. మహానాడులో పలు తీర్మానాలను ఆమోదించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ వీవీవీ చౌదరి, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ మందపల్లి చంద్రశేఖర్, రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ గడి సత్యవతి, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ గుడాల జయబాబు, నాయకులు పాల్గొన్నారు.

మరణ శాసనమే..

- అడ్డూఅదుపూ లేని వేగం
- ప్రధాన రహదారిలో ప్రమాదాలు
- పట్టించుకోని పోలీసులు

రామచంద్రపురం: పట్టణంలో ప్రధాన రహదారిని సీసీ రోడ్డుగా మార్చి దాదాపుగా ఏడేళ్లు కావస్తున్నా, మధ్యలో వేసిన డివైడర్లు మృత్యుకుహరాలుగా మారాయి. ఆకతాయిల స్పీడుకు అడ్డూ అదుపు లేక పోవడంతో డివైడర్లను ఢీకొట్టి ఇప్పటివరకు పది మందికి పైగా మృత్యువాత పడ్డారు. మరికొంత మంది తీవ్రగాయాల పాలయ్యారు. ఇదంతా ఎందుకు జరుగుతుందంటే సీసీ రోడ్డులో ఆకతాయిలు మోటారు సైకిళ్ల స్పీడ్‌కు అడ్డే లేకుండా పోతుంది. వారి స్పీడుకు రోడ్డులో నడిచి వెళ్లే వారు కూడా హడలెత్తిపోతున్నారు. బైక్‌లపై వెళ్లే కొంత మంది ఆకతాయిలకు పగలు రాత్రి తేడా లేదు వారికి... ఎదురుగా ఏమొస్తుందో కూడా వారికి అనవసరం లేదు. వారు మాత్రం యమా స్పీడులో వెళుతూ ప్రమాదాలకు గురిచేస్తున్నారు. హైస్పీడుతో మోటారు వాహనాలు వెళుతుంటే పాదచారులు, ఎదురుగా వచ్చే వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. ఇక రాత్రివేళల్లో అయితే ఇక సరే సరి. ప్రధాన రహదారిలో జరుగుతున్న వరుస ప్రమాదాలతో పట్టణ వాసులు హడలెత్తిపోతున్నారు. స్థానిక రాజగోపాల్ సెంటర్ నుంచి పసలపూడి బైపాస్ రోడ్డు వరకు గల ప్రధాన రహదారిలో యువకులు ఇష్టానుసారంగా మోటారు సైకిళ్ల నడుపుతున్న వైనం భయాందోళనకు కలిగిస్తుంది. ప్రతీ



ప్రధాన రహదారిలో ప్రణాళికా బద్ధంగా లేని డివైడర్లు

రోజు పట్టణానికి వందలాది వాహనాలు వస్తుంటాయి. ప్రధాన రహదారిలో ప్రభుత్వ కార్యాలయాలకు ఇతర మార్కెట్ పనుల మీద వచ్చే వారి వాహనాల సంఖ్య అధికమే. ట్రాఫిక్ రద్దీగా ఉంటుంది. రద్దీగా ఉంటున్న ట్రాఫిక్‌ను సైతం దాటుకుంటూ కొంత మంది సుమారుగా 50 నుంచి 70 కిలోమీటర్ల స్పీడుతో మోటారు వాహనాలు నడుపుతూ స్పీడ్‌గా వెళుతున్నారు. ప్రధాన కూడలైన రాజగోపాల్ సెంటర్, మార్కెట్ సెంటర్లలో పోలీసులు పహారా కాస్తున్నా వారి కళ్లు కప్పి మరీ వెళ్లిపోతున్నారు. దీంతో చాలా చోట్ల ప్రమాదాలు తప్పడం లేదు.

ప్రణాళికా బద్ధంగా లేని డివైడర్లు

సీసీ రోడ్డులో ఏర్పాటు చేసిన డివైడర్లు ప్రణాళికా బద్ధంగా లేకపోవటం కూడా ప్రమాదాలకు దారి తీస్తున్నాయి. డివైడర్ల కారణంగా స్పీడుగా వస్తున్న వారి బారి నుంచి తప్పించుకునేందుకు వీలుగా సరిపడా రోడ్డు లేక ప్రమాదాలు జరగక తప్పడం లేదు. డివైడర్లకు పలు చోట్ల ఖాళీలు ఇవ్వటం కూడా ప్రమాదాలు జరగటానికి కారణాలవుతున్నాయని పట్టణవాసులు అంటున్నారు. ఇరుకు రోడ్డు ఉన్న చోట కూడా డివైడర్లు వేయటం మూలంగా వాహన చోదకులకు పాట్లు తప్పడం లేదు.

అడ్డుకట్ట వేయాలి. ఇదిలా ఉండగా ప్రధాన రహదారిలో భారీ వాహనాలను నిషేధించినా నిత్యం వెళుతూనే ఉన్నాయి. మట్టిని తీసుకువెళుతున్న టిప్పర్లు, భారీ వాహనాలు, లారీలు ప్రధాన రహదారిలోనే వెళుతున్నాయి. ప్రధాన రహదారిలో ఇంత జరుగుతున్న ప్రమాదాల నివారణకు అటు అధికారులు గానీ, పోలీసులు గానీ ఎటువంటి చర్యలు తీసుకోకపోవటంతో పట్టణవాసులు విమర్శిస్తున్నారు. పట్టణంలో భారీ వాహనాలు రాకుండా చేయాలని వారు కోరుతున్నారు. అడ్డూఅదుపూ లేకుండా అతి వేగంతో వెళుతున్న వాహనాల స్పీడుకు పోలీసులు తగిన బుద్ధి చెప్పాలని పట్టణవాసులు కోరుతున్నారు. ఉదయం సాయంత్రం వేళలో ట్రాఫిక్ అధికంగా ఉన్న వేళ ట్రాఫిక్ పోలీసులను ఏర్పాటు చేసి భారీ వాహనాలకు బైపాస్ రోడ్డు మీదుగా వెళ్లే విధంగా చూడాలని కోరుతున్నారు.

ఆకతాయిలకు అడ్డుకట్ట వేయాలి



ప్రధాన రహదారిలో ఆకతాయిలు అడ్డూ అదుపూ లేకుండా వాహనాలు నడుపుతున్నారు. రోడ్డు మీద వెళ్లే వాహనదారులు ఆ స్పీడుకు బెంబేలెత్తిపోతున్నారు. పోలీసులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఆకతాయిల స్పీడు అరికట్టాలి.

– కుప్పిల సూర్యనారాయణ, రామచంద్రపురం

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి



ప్రధాన రహదారిలో జరుగుతున్న ప్రమాదాల నివారణకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. అడ్డదిడ్డంగా ఉన్న డైవడర్లను సరిచేసి ప్రమాదాలను నివారించాలి. లేదంటే చాలామంది ప్రమాదాలకు లోనయ్యే అవకాశం ఉంది.

– దొమ్మలపాటి శ్యాం, రామచంద్రపురం

లో ఓల్టేజీతో యాతన



పాడైన అనుబంధ ట్రాన్స్‌ఫార్మర్

కపిలేశ్వరపురం: అంగర గ్రామంలో రాజమ్మ కాలనీలోని అమ్మవారి ఆలయం వద్ద విద్యుత్ అనుబంధ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురైంది. సుమారు ఏడాది క్రితం తలెత్తిన ఈ సమస్య పరిష్కారం కాకపోవడంతో సమీపంలోని సుమారు 150 నివాసాల వినియోగదారులు లో ఓల్టేజ్ సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. వేసవి వేడిమి నేపథ్యంలో చిన్నారులు, వృద్ధులు తీవ్రంగా అవస్థ పడుతున్నారు. అనుబంధ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతు రావడంతో 2024 మేలో మరొకటి మార్చగా అదేరోజు రాత్రి మళ్లీ మరమ్మతుకు లోనైందని స్థానికులు చెబుతున్నారు. దీనిపై విద్యుత్ శాఖ సిబ్బందికి తెలియజేయగా సుమారు నాలుగు నెలలు క్రితం మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చారన్నారు. అది సైతం మరమ్మతుకు లోనయ్యిందని, సుమారు ఏడాది కాలంగా లోఓల్టేజీ సమస్యతో సతమతమవుతున్నామంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు వేణుగోపాలస్వామి విగ్రహ ప్రతిష్ఠ

కపిలేశ్వరపురం: నాగులచెరువు గ్రామంలో సోమవారం వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రతిష్ఠ కార్యక్రమం అనంతరం ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

రాధాకృష్ణను పలకరించిన మాజీ మంత్రి వేణు



మండపేటలో రెడ్డి రాధాకృష్ణతో మాట్లాడుతున్న మాజీ మంత్రి వేణు

కపిలేశ్వరపురం (మండపేట): ఇటీవల మండపేటలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మున్సిపల్ కౌన్సిల్ కో ఆప్షన్ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ (రాజు బాబు) కుమారుడు సందీప్ గాయాలపాలయ్యాడు. ప్రస్తుతం ప్రమాదం నుంచి కోలుకొని హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా ఆదివారం మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ రాజు బాబు నివాసానికి వచ్చి పలకరించారు. ప్రమాద ఘటన వివరాలను అడిగి తెలుసుకొన్నారు. త్వరతగతిన పూర్తిగా కోలుకుంటాడంటూ రాజు బాబుకు ధైర్యం చెప్పారు. రాజుబాబును పలకరించిన వారిలో ఓగిరాల దేవి, పిఠాపురం సత్యనారాయణ, పిల్లి శ్రీను, పెంకే గంగాధర్, సాధనాల శివభగవాన్ ఉన్నారు.

కాలువల్లోకి మురుగునీరు రాకుండా చర్యలు చేపట్టండి



పంట కాలువలో వ్యర్థాలను చూపిస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

రాయవరం: చెల్లూరులో పంట కాలువల్లోకి మురుగునీరు రావడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై ఆదివారం రైతులు పంచాయతీ కార్యదర్శి లేఖ రాశారు. పంట కాలువ పరిస్థితిని చూపిస్తూ నిరసన వ్యక్తం చేశారు. చెల్లూరు గ్రామంలో మురుగునీరు పంచాయతీ డ్రైనేజీ ద్వారా పాత సినిమా హాల్ వెనుక నుంచి పోలేరమ్మ గుడి వెనుక ఉన్న పంట కాలువలోకి మళ్లిస్తున్నారన్నారని రైతులు బొల్లంరెడ్డి పట్టాభిరామన్న, పుట్టా రామకృష్ణ, చుండ్రు రమేష్, దేవిన ప్రసాద్ తదితరులు తెలిపారు. పంట కాలువ కింద సాగు చేస్తున్న పంటపొలాల్లోకి మురుగు నీరు రావడంతో వలన పంట భూమి పాడవుతుందన్నారు. పంటలు పండినా దిగుబడి రావడం లేదన్నారు. దీని వలన రైతులు నష్టపోతున్నట్టు వారు ఆవేదన వ్యక్తం చేశారు. పంట కాలువ నుంచి దుర్వాసన, వ్యర్థాల వలన పంట కాలువలు శుభ్రం చేయడానికి ఎవరూ ముందుకు రావడం లేదని, అలాగే పూడిక పేరుకుపోవడంతో పై నుంచి పంట నీరు కిందకు రావడం లేదన్నారు. డ్రైనేజీ నీరు పంట కాలువలోకి రాకుండా తగిన చర్యలు తీసుకుని, రైతుల పంట భూములను కాపాడాలని ఆయన రైతులు కార్యదర్శికి ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ దేవు వెంకట్రాజు, రైతులు పసల పనసయ్య, గుణ్ణం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖ పారిశ్రామివేత్త సత్తి శ్రీనివాసరెడ్డికి పితృవియోగం



సత్తి సూరారెడ్డి (ఫైల్)

అనపర్తి : మండలంలోని పొలమూరు గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త సత్తి శ్రీనివాసరెడ్డి తండ్రి సూరారెడ్డి(90) ఆదివారం దివంగతులయ్యారు. ఆకస్మిక మరణ వార్తతో బంధువులు, శ్రేయోభిలాషులు, అభిమానులు శోక సంద్రంలో మునిగిపోయారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. ఆయన కుమారులు కొండారెడ్డి, శ్రీనివాసరెడ్డి రైస్‌మిల్లు వ్యాపారంలో ప్రసిద్ధిగాంచారు. గ్రామంలో సామాజిక భవనంతో పాటు ఆలయల నిర్మాణం చేపట్టిన ఆయన గ్రామాభివృద్ధికి ఇతోధికంగా సహకారమందించారు. పొలమూరుతో పాటు కానేడు, బిక్కవోలు గ్రామాల్లోను రైస్ మిల్లులు ఏర్పాటు చేసి అనేక మందికి ఉపాధి కల్పించారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి, నల్లమిల్లి శేషారెడ్డి, పుదుచ్చేరి మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు సూరారెడ్డి భౌతిక కాయానికి నివాళులు అర్పించారు. జిల్లా పరిషత్ మాజీ ప్రతిపక్షనేత సత్తి రామారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ సబ్బెళ్ళ కృష్ణారెడ్డి, తెలుగు ఫిలిం ఛాంబర్ అధ్యక్షుడు భరత్ భూషణ్, గజల్ శ్రీనివాస్, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కర్రి వెంకటరెడ్డి తదితరులు ఆయనకు సంతాపం ప్రకటించారు.

నేడు రావులమ్మ జాతర

అంబాజీపేట: కె.పెదపూడిలో వేంచేసిన రావులమ్మ అమ్మవారి జాతర సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. అమ్మవారి జాతరలో భాగంగా ప్రత్యేక పూజలను గత నాలుగు రోజులు నుంచి అమ్మవారికి ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం అమ్మవారి తీర్థం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అదే రోజు అమ్మవారికి ఉయ్యాల సేవ నిర్వహించనున్నారు.

తైక్వాండోకు పెరుగుతున్న ఆదరణ



అంబాజీపేటలో తైక్వాండోలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు

అంబాజీపేట: ఆత్మరక్షణతో పాటు ఉత్తమ క్రీడాకారుడిగా గుర్తింపు పొందేందుకు ఇటీవల కాలంలో తైక్వాండోపై విద్యార్థులు ఆసక్తి కనబరుస్తున్నారు. అంబాజీపేట, ముంగండ జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న తైక్వాండో వేసవి శిక్షణ శిబిరంలో సుమారుగా 200 మంది క్రీడాకారులు పాల్గొని శిక్షణ పొందుతున్నారు. బాలికలు అధికంగా పాల్గొని శిక్షణ పొందుతున్నారు. క్రీడలు మానసికోల్లాసానికి, శరీర దృఢత్వానికే కాకుండా ఆరోగ్యానికి వ్యాయామం ఎంతో ఉపయోగమనే లక్ష్యంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆసక్తి కనబరుస్తున్నారు. స్థానిక హైస్కూల్‌లో తైక్వాండో సీనియర్ కోచ్ పితాని త్రిమూర్తులు, పితాని లక్ష్మీభార్గవి పర్యవేక్షణలో సుమారు 20 ఏళ్లుగా తైక్వాండో శిక్షణ ఇస్తున్నారు. ఇక్కడ తర్ఫీదు పొందిన 30 మంది క్రీడాకారులు జాతీయ స్థాయిలోను, 150 మంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై గోల్డ్ మెడల్ సాధించిన వారిలో ఉన్నారు. బ్లాక్ బెల్ట్ పొందిన క్రీడాకారులు 30 మంది, నేషనల్ రిఫరీలుగా విధులు నిర్వహిస్తున్న వారు 9 మంది ఉన్నారు. వేసవి సెలవులు కావడంతో చిన్నారులను సైతం తైక్వాండో వైపే వారి తల్లిదండ్రులు మొగ్గు చూపుతున్నారు. వేసవి శిక్షన పూర్తయిన అనంతరం కూడా శిక్షణ తరగతులను ఉదయం 6 గంటల నుంచి నిర్వహిస్తామని త్రిమూర్తులు తెలిపారు.

పైపుల్లో నీళ్లు రాక అవస్థలు

- నాలుగు రోజులుగా కుళాయిల బంద్
- తాగునీరు లేక ప్రజలకు ఇక్కట్లు
- తరచూ అవాంతరాలే..



మొగలిపాలెంలోని ఒక వీధిలో తాగునీటి కోసం కుళాయి వద్ద ఉంచిన బిందెలు, బకెట్లు



గొల్లపాలెంలో ఒక ప్రైవేటు మినరల్ వాటర్ ప్లాంట్ వద్ద నీటి కోసం వరుసగా ఉంచిన టిన్నులు

కాజులూరు: కాజులూరు, కరప మండలాల్లోని పలు గ్రామాల్లో గత నాలగు రోజులుగా కుళాయిలు బంద్ కావటంతో ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. మండల గ్రామాల్లో గత కొన్ని రోజులుగా తరచూ ఇదే తరహాలో అంతరాయాలు తలెత్తుతున్నప్పటికీ అధికారులు పూర్తి స్థాయిలో పరిష్కార మార్గాలు చేపట్టకపోవటంతో ప్రజలు ఆగ్రహానికి గురవుతున్నారు. గొల్లపాలెం భారీ రక్షిత మంచినీటి పథకం నుంచి సమీపంలోని కాజులూరు, కరప మండలాల్లో 24 గ్రామాలకు కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా జరుగుతుండగా పలు గ్రామాల్లో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలోని మినీ రక్షిత మంచి పథకాల ద్వారా సాగునీటి సరఫరా జరుగుతుంది. అయితే గత నాలుగు రోజులుగా గొల్లపాలెం భారీ రక్షిత మంచినీటి పథకం పరిధిలో ఉన్న గ్రామాలకు తాగునీరు సరఫరా జరగడం లేదు. గతంలో రోజూ క్రమం తప్పకుండా కుళాయిల నుంచి తాగునీరు సరఫరా చేసే వారని ఆపై గ్రామాల్లో తాగునీటి వాడకం పెరగడంతో డిమాండ్ పెరిగి, సప్లయ్ సరిపోక అధికారులు రెండు రోజులకు ఒక్కసారి తాగునీరు విడుదల చేయడం ప్రారంభించారని ఇటీవల అవి కూడా సక్రమంగా రావడం లేదని ప్రజలు ఫిర్యాదు చేస్తున్నారు. తాగునీటి సమస్యలపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులెవరూ పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కుళాయిలకు నీరు రావడం లేదని పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదులు చేస్తుంటే వారు గొల్లపాలెం భారీ రక్షిత మంచినీటి పథకం వద్దకు వెళ్లి ఫిర్యాదులు చేయమంటున్నారన్నారు. అక్కడకు ఎప్పుడు వెళ్లినా అధికారులెవరూ ఉండటం లేదని స్థానికులు వాపోతున్నారు.

పైపులైన్లలో లీకేజీలు

మండలంలోని చేదువాడలో ప్రధాన పైపులైనుకు లీకేజీ ఏర్పడటంతో గత నాలుగు రోజులుగా కుళాయిలకు నీటి సరఫరా నిలిచిపోయినట్లు సిబ్బంది చెబుతున్నారు. రెండు రోజులుగా మరమ్మతులు నిర్వహిస్తున్నా ఫలితమివ్వడం లేదని మరమ్మతులకు అవసరమైన వస్తు, సామగ్రి స్థానికంగా అందుబాటులో లేకపోవటంతో కాంట్రాక్టర్ విజయవాడ నుంచి మెటీరియల్ రప్పిస్తుండటంతో ఆలస్యమౌతున్నట్టు చెబుతున్నారు. కుళాయిల నుంచి నీరు రాకపోవడంతో అధిక ధరలకు ప్రైవేటు సంస్థల నుంచి నీరు కొనుక్కుని తాగాల్సి వస్తుందని ఇప్పటికైనా అధికారులు స్పందించి త్వరితగతిని పైపులైనుకు మరమ్మతులు చేసి గ్రామాల్లో కుళాయిల ద్వారా తాగునీటి సరఫరా చేయాలని మండల గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సీతారామచంద్రస్వామి శతాబ్ది మహోత్సవాలు

అయినవిల్లి: మండలంలోని అయినవిల్లిలంకలో సీతా రామచంద్రస్వామివారి శతాబ్ది మహోత్సవాలు ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రారంభించారు. వైఖానస ఆగమ శాస్త్ర మహదాచార్య ఆగమ విద్యానిధి వాడపల్లికు చెందిన సుందర్శనం వెంకట జనార్దనాచార్యుల ఆధ్వర్యంలో రుత్వికులు స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు జరిపారు. మహాసుదర్శన, అష్టోత్తర శత కలశాభిషేక, శ్రీలక్ష్మీనారాయణ, శ్రీరామ నామయజ్ఞ మహోత్సవం నిర్వహించారు. దివ్య వైఖానస భగవత్ శాస్త్ర ఆగమ విధానం ప్రకారం పాంచాహ్నిక దీక్షా పూర్వకంగా నిర్వహించారు. 1925లో ఈ ఆలయాన్ని ప్రతిష్ఠించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, ఋత్విక్‌వరుణ, దీక్షా ధారణ, అకల్మష హోమం, ప్రసాద వితరణ, వల్మీక మృత్తికా సంగ్రహణం, యాగశాల ప్రవేశం, యాగ మందిర పూజ, నవ కుంభారాధన, అంకురార్పణ, వాస్తు పూజ, షటుకుండ ప్రణయనం, అగ్ని ప్రతిష్ఠాపన, వాస్తు శుద్ధి, యాగశాల ప్రధానహోమం, వర్ధవర్ధన దైవత్య హోమం వంటి పూజలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఐదు రోజుల పాటు ఈ పూజలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఐక్యతకు ప్రతీకగా తిరంగా ర్యాలీ

- మండపేటలో 200 మీటర్ల త్రివర్ణ జెండా ప్రదర్శన
- ప్రత్యేక ప్రార్థనలు చేసిన మైనార్టీలు



మండపేట పట్టణంలో ర్యాలీగా సాగుతున్న నియోజకవర్గ ప్రజలు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణం మువ్వన్నెల జెండాతో మురిసింది. కుల, మత, ప్రాంతాలను పక్కనపెట్టి భారత్ మాతాకు జై అంటూ దిక్కులు పిక్కటిల్లేలా నినదిస్తూ నియోజకవర్గ ప్రజలు ర్యాలీగా సాగారు. దేశ సరిహద్దుల్లో ప్రాణాలను పణంగా పెట్టి పోరాడుతున్న సైనికుల వెంట తామున్నామంటూ భరోసా ఇస్తూ అడుగులు వేశారు. 200 మీటర్ల మువ్వన్నెల జెండాను చేతపట్టి పట్టణ వీధుల్లో ర్యాలీ చేశారు. కాశ్మీర్ అలజడి నేపథ్యంలో ఆపరేషన్ సిందూర్ విజయాన్ని చాటి చెబుతూ మండపేటలో ఆదివారం తిరంగా యాత్ర నిర్వహించారు. రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా, దళిత సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పట్టణంలోని మసీదులు, చర్చిలు, ఆలయాల నుంచి ముస్లిం, క్రైస్తవ, హిందూ మతాల ప్రతినిధులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ, నియోజకవర్గ కన్వీనర్ కేవీవీ సాయిరామ్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ళ లీలాకృష్ణ, దళిత నేత ధూళి జయరాజు ర్యాలీలో పాల్గొన్నారు. కేపీరోడ్డులోని రథం గుడి సెంటర్ నుంచి కలువపువ్వు సెంటర్, ప్రధాన రహదారి మీదుగా బస్ స్టాండ్ సెంటర్ వరకూ ర్యాలీ సాగింది. కార్యక్రమంలో నాయకులు గౌడవర్తి రామచంద్రరావు, నల్లమిల్లి వీర్రెడ్డి, ఉంగరాల రాంబాబు, నామాల చంద్రరావు, మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాల నుంచి ప్రజలు పాల్గొన్నారు.

పుష్కరాలకు మనమూ వెళ్దామా..

- 26 వరకు కొనసాగనున్న సరస్వతీ నదీ పుష్కరాలు
- రామచంద్రపురం ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు



కాళేశ్వరం సరస్వతీ నది పుష్కర యాత్రకు సిద్ధం చేసిన ప్రత్యేక బస్సులు

రామచంద్రపురం రూరల్: కాళేశ్వరం సరస్వతీ నదీ పుష్కరాలకు వెళ్లేందుకు రామచంద్రపురం ఆర్టీసీ డిపో నుంచి భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ పేపకాయల భాస్కరరావు తెలిపారు. రామచంద్రపురం డిపో నుంచి కాళేశ్వరం సరస్వతీ నదీ పుష్కరాల్లో నదీ స్నానం ఆచరించే విధంగా పలు పుణ్యక్షేత్రాలను కలుపుతూ కొత్తగా వచ్చిన సూపర్ లగ్జరీ వీడియో కోచ్ బస్సులను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

యాత్ర సాగేదిలా..

3 రోజుల పాటు ..

ఈ నెల 15 నుంచి 26 వరకు జరగనున్న కాళేశ్వరం సరస్వతీ నదీ పుష్కరాలకు ప్రత్యేక బస్సులు వరంగల్లు భద్రకాళీ మాత ఆలయం, వేములవాడ రాజ రాజేశ్వరి అమ్మవారి ఆలయం, కొండగట్టు అంజనేయస్వామి ఆలయం, ధర్మపురి శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయం, కాళేశ్వరం మహా కాళేశ్వరుడు ఆలయం, పుష్కర స్నానం, రామప్ప దేవాలయ దర్శనంతో 3 రోజుల యాత్రకు రూ.2,300 టికెట్ ధర నిర్ణయించారు.

సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు..

9550 32426	బండి ముత్యాలరావు
79979 08887	గెద్దం శ్రీనివాసరావు
ఆర్టీసీ ఎంక్వైయిరీ	73829 25520

భక్తులు సద్వినియోగం చేసుకోవాలి



భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ప్రత్యేక సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలి. 3 రోజుల యాత్ర 2 ప్లస్ 2 పుష్ బ్యాక్ విశాలమైన సీట్లతో కూడిన సరికొత్త సూపర్ లగ్జరీ వీడియో కోచ్ బస్సులలో ప్రయాణం సురక్షితంగా, సౌకర్యవంతంగా ఉంటుంది. తగినంత మంది ప్రయాణికులు ఉంటే భక్తులకు వారి సొంత గ్రామం నుంచే బస్సు బయలుదేరేలా ఏర్పాటు చేస్తాం.

– పేపకాయల భాస్కరరావు, డిపో మేనేజర్, రామచంద్రపురం డిపో